

అన్న మరణాన్ని తట్టుకోలేక..

అన్న మరణాన్ని తట్టుకోలేక తమ్ముడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బీబీపేటలో చోటుచేసుకుంది.

- 8లో ▸



ముగిసిన ప్రీమియర్ లీగ్

గర్గుల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నీ మంగళవారం ముగిసింది.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం 31.4 /12.5

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. రాత్రిపూట చలి తీవ్రత పెరుగుతుంది. పొగమంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పొగమంచుతో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు



గాంధారి(ఎల్లారెడ్డి): పొగ మంచు కారణంగా మంగళవారం ఉదయం గాంధారి మండలం గుడిమెట్ స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు వెళ్లింది. డ్రైవర్ అప్రమత్తమై బస్సును వెంటనే నిలిపివేయగా రోడ్డు పక్కన ఒరిగింది. దీంతో ప్రమాదం తప్పింది. బాన్సువాడ నుంచి కామారెడ్డి వైపు వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. బస్సులో సుమారు పది మంది ప్రయాణికులుండగా అందరూ సురక్షితంగా బయటపడ్డారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు రాలేదన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

- జిల్లా రవాణాశాఖాధికారి వాణి



భిక్కనూరు: వాహనదారులు నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు చెక్‌పెట్టవచ్చని జిల్లా రవాణాశాఖ అధికారి వాణి అన్నారు. సోమవారం భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి బైకులు నడిపిస్తున్న వారికి గులాబీలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుందని, ప్రతి నాలుగు నిమిషాలకు ఒక్కరు మృతి చెందుతున్నారన్నారు. వాహనదారులు నిబంధలను పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అధిక వేగంతో, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పీఆర్‌టీయూ(తెలంగాణ) జిల్లాశాఖ డిమాండ్ చేసింది. పీఆర్‌టీయూ(టి) జిల్లా సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక పద్మిశా హోటల్‌లో జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జనపాల లక్ష్మీరాజం, ప్రతినిధులు ఎం.నర్సింగరావు, సాయాగౌడ్, ఆనంద్, లెనిన్, వెంకటి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల



బాన్సువాడ: మతబోధనలు చేస్తున్న ప్రైవేటు పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం బాన్సువాడ బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాన్సువాడలోని ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు మత బోధనలు చేస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుని, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని.. పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. తిమ్మాపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని దేవాదాయశాఖ ఆధీనంలోకి తీసుకుని ఆలయ కమిటీని నియమించాలని కోరారు. జిల్లాలోని కొన్ని రైస్‌మిల్లులు పీడీఎస్ బియ్యంను కొనుగోలు చేసి ఎఫ్‌సీఐకి ఇస్తున్నాయన్నారు. వాటికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌కార్గె, శంకర్‌గౌడ్, కోనాల గంగారెడ్డి, డాకయ్య, హన్మాండ్లు యాదవ్ పాల్గొన్నారు.

సంబురంగా సంక్రాంతి



కామారెడ్డి పట్టణంలో పతంగులను ఎగురవేస్తున్న యువతీయువకులు



కామారెడ్డిలోని వివేకానంద కాలనీలో అయోధ్య రామమందిరం ముగ్గు వేస్తున్న యువతులు



రైతునగర్‌లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎమ్మెల్యే పోచారం

సంక్రాంతి సంబురాలను జిల్లా వ్యాప్తంగా ప్రజలు సోమ, మంగళవారాల్లో ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో ఇళ్ల ముందు మహిళలు రంగురంగుల ముగ్గులను వేశారు. అనంతరం మహిళలు నోములను నోచుకున్నారు. దీంతోపాటు చిన్నారులు గాలిపటాలను ఎగురవేస్తూ సందడి చేశారు. కనుమ రోజు పశుపక్ష్యాదులకు పూజలు నిర్వహించారు.

గాంజా.. మజా!

గంజాయి మత్తులో జోగుతూ యువత చిత్తవుతోంది. సరదాగా మొదలైన అలవాటు వ్యసనంగా మారి వారి జీవితాలను నాశనం చేస్తోంది. జిల్లాలో గంజాయి కొత్తకొత్త రూపాల్లో లభ్యమవుతోంది. మొన్నటి దాకా గంజాయి పొట్లాలు దొరికేవి. ఇప్పుడు కొత్తగా ద్రవరూప గంజాయి వెలుగు చూడడం ఆందోళన కలిగిస్తోంది. కామారెడ్డి పట్టణంతో పాటు పట్టణానికి చుట్టుపక్కల ప్రదేశాలే గంజాయి విక్రయాలకు అడ్డాగా మారినట్లు తెలుస్తోంది.

మత్తులో జోగుతున్న యువత

- కొత్తకొత్త రూపాల్లో పుట్టుకొస్తున్న గంజాయి
- ద్రవరూపంలోనూ అందుబాటులోకి..
- జిల్లాలో విచ్చలవిడిగా అమ్మకాలు



దబ్బాల్లోని ద్రవరూప గంజాయి



సాక్షి, కామారెడ్డి: జిల్లాలో గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. కామారెడ్డి పట్టణ శివారులో ఆదివారం సాయంత్రం ఏడుగురు గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడిన ఘటనే ఇందుకు నిదర్శనం. వీరిలో దేవునిపల్లికి చెందిన ఓ యువకుడు, కామారెడ్డి పట్టణానికి చెందిన మరో యువకుడు ద్రవరూప గంజాయి తెచ్చి విక్రయిస్తుండగా.. సేవిస్తూ దొరికిన ఐదుగురు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారుల పిల్లలేనని తెలుస్తోంది. అయితే ద్రవరూప గంజాయి ఎక్కడి నుంచి వస్తుందనే అంశంపై పోలీసులు ఆరా తీయగా ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఎవరికీ అనుమానం రాకుండా ద్రవాన్ని చిన్నచిన్న డబ్బాలు, సీసాల్లో ప్యాక్ చేసి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మత్తు పదార్థాలను కట్టడి చేయడానికి చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఇటీవల నార్కోటిక్స్ వింగ్ పోలీసులు కల్లులో కలిపే మత్తు పదార్థాల సరఫరా ముఠాను సైతం పట్టుకున్నాన్న విషయం విదితమే. ఆ ముఠాలో కామారెడ్డికి చెందిన ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్, జిల్లాకు చెందిన మత్తు దందా నిర్వాహకులు కూడా ఉన్నారు.

మరింత నిఘా అవసరం..

యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్న మత్తు పదార్థాల దందా విషయంలో పోలీసు శాఖ మరింత నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. జిల్లా కేంద్రంతో పాటు పట్టణ పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలపై దృష్టి సారించి మూలాలను పట్టుకునే ప్రయత్నం జరగాలని పలువురు కోరుతున్నారు. మత్తు దందా సాగించేవారిపై మరింత కఠినంగా వ్యవహరించి కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. జిల్లాలో ఎవరైనా మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నా, అమ్ముతున్నా 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని జిల్లా పోలీసు అధికారులు పేర్కొన్నారు.

ఏడుగురి రిమాండ్

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి సమీపంలోని క్యాసంపల్లి శివారులో ఉన్న ఓ అడ్డాలో ద్రవరూప గంజాయి డబ్బాలను విక్రయిస్తున్న ముఠాను ఆదివారం సాయంత్రం రూరల్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు కొనుగోలు చేస్తున్న ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. వీరి వద్ద నుంచి ఖరీదైన మూడు కార్లు, ఓ బైక్, రెండు స్కూటీలు, 7 సెల్ ఫోన్లు, 190 గ్రాముల ఆయిల్ గంజాయి డబ్బాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 97వేల 500 ఉంటుందన్నారు.

అరకు నుంచి సరఫరా

కేసు విచారిస్తున్న పోలీసులు విశాఖపట్నం దగ్గరలోని అరకు ప్రాంతం నుంచి ద్రవరూపంలో(ఆయిల్) గంజాయిని సిద్ధం చేసి డబ్బాల్లో నింపి కామారెడ్డికి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ద్రవరూపంలో(ఆయిల్) తయారు చేస్తే ఎవరికీ అనుమానం రాకుండా ఉంటుందని.. అరకు ప్రాంతంలో ఇటీవల ఈ విధంగా తయారు చేస్తున్నారని తేలింది. కేసులో చాకచాక్యంగా వ్యవహరించిన రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజులను ఏఎస్పీ నర్సింహారెడ్డి అభినందించారు.

జిల్లాలో యథేచ్ఛగా..

జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల్లో యువతను టార్గెట్‌గా చేసుకుని మత్తు కోసం గంజాయి అంటగడుతున్నారు. చిన్నచిన్న పొట్లాల రూపంలో అమ్ముతున్నారు. అప్పుడప్పుడు గంజాయి అమ్మకాల విషయం తెలిసి పోలీసులు దాడులు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పలు అడ్డాలతో పాటు 44వ నంబరు జాతీయ రహదారి వెంట కొన్ని అడ్డాలు ఏర్పాటు చేసుకుని విక్రయిస్తున్నారు. వాట్సాప్ ద్వారా లొకేషన్ షేర్ చేసి అక్కడికి రప్పిస్తున్నారు. విద్యార్థులు, యువకులు మత్తు కోసం గంజాయికి అలవాటు పడుతున్నారు. ఒకరిని చూసి ఒకరు గంజాయి పీలుస్తూ మత్తులో మునిగితేలుతున్నారు. భిక్కనూరు మండలంలోని పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కూడా గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.

కన్నవారిలో కలవరం..

కామారెడ్డి ప్రాంతంలో గంజాయి లాంటి మత్తు పదార్థాల అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతుండడంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లలు ఇంటికి ఆలస్యంగా వచ్చారంటే చాలు తల్లిదండ్రులు వణికిపోతున్నారు. ఎక్కడెక్కడ తిరిగారోనని టెన్షన్ పడుతున్నారు. మత్తుకు అలవాటు పడితే ఆ కూపం నుంచి బయటపడలేరనే భయంతో ఉన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు మత్తుకు అలవాటుపడి చదువులో దెబ్బతిన్నారు. ఆ మత్తు కూపం నుంచి బయటపడేయడానికి తల్లిదండ్రులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు ఎటు తిరుగుతున్నారోనని కాపలా కాసే పరిస్థితి ఏర్పడింది.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం



అభివాదం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటానికి సిద్ధమవుతామని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నేతలు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో సమస్యలపై చర్చించారు. విద్యారంగ, ఉపాధ్యాయ, ప్రభుత్వ పాఠశాలల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను ఖండించారు. సంఘాలన్నింటిని ఏకతాటిపై తీసుకొచ్చే క్రమంలో అన్ని సంఘాలతో కలిసి ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నూతన కార్యవర్గం ఏర్పాటు చేశామన్నారు.

ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య కమిటీ

ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా కమిటీ చైర్మన్‌గా భిక్కనూరు యాదయ్య, కో–చైర్మన్‌గా కుంట రాములు, అబ్దుల్ హాది, బషీర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పంపరి ప్రవీణ్‌కుమార్, ముజీబుద్దీన్, కోశాధికారిగా దేవులా, తిరుపతి, టెక్నికల్ సెక్రెటరీగా సంతోష్, రాజేశ్, అకాడమిక్ కౌన్సిలర్లుగా అరుణ్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, ప్రభాకర్, సలహాదారులుగా విజయరామరాజు, హన్మంత్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

త్వరలో రైల్వేగేటు మూసివేత!



నిజామాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మాధవనగర్ రైల్వేగేట్‌ను నెలరోజుల పాటు మూసివేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు నెల రోజుల పాటు గేటు మూసివేయాలని అధికార వర్గాలు నిర్ణయించినట్లు తెలిసింది.



ట్రాక్టర్‌తో దమ్ము చేస్తూ..

ఊపందుకున్న రబీ పనులు

నిజాంసాగర్ ప్రధాన కాలువ కింద, బోరు బావుల వద్ద వరినాట్లు ఊపందుకున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులో, చెరువుల్లో పుష్కలంగా సాగునీరు ఉండడంతో బాన్సువాడ మండలం వరినాట్లు వేస్తున్నారు. రైతులు ట్రాక్టర్లతో పొలం దమ్ము చేస్తుంటే.. వానపాములను తినేందుకు కొంగలు పంటపొలాల్లోకి వచ్చి కనువిందు చేస్తున్నాయి.

– బాన్సువాడ రూరల్



నాట్లేస్తున్న మహిళలు

చివరి ఆయకట్టుకు చేరని నీరు

వృథా అవుతున్న 'పోచారం' నీరు

- ఈ యేడు రబీలో ప్రాజెక్టు నీళ్లు 'బీ' జోన్‌కు కేటాయింపు
- 'ఏ' జోన్ డిస్ట్రిబ్యూటరీలను తాత్కాలికంగా మట్టితో మూసేసిన అధికారులు
- డిస్ట్రిబ్యూటరీలు శిథిలమవడంతో సాగునీరు వృథా



డి-5 కాలువ ద్వారా వృథాగా మంజీరలోకి వెళ్తున్న సాగునీరు



మాల్తుమ్మెద శివారులో బీడు భూముల్లోకి పారుతున్న పోచారం నీరు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు నీరు డిస్ట్రిబ్యూటరీల ద్వారా వృథాగా పోతుంది. డిస్ట్రిబ్యూటరీలు శిథిలమవడంతో వాటి షెట్టర్ల ద్వారా లీకేజీల రూపంలో నీరు వృథాగా బీడుభూముల వెంట పారుతూ మంజీరలోకి వెళ్తుంది. ప్రాజెక్టు నుంచి సాగునీటిని ఈ యేడు 'బీ' జోన్‌కు కేటాయించారు. ఇందులో భాగంగా 'ఏ' జోన్ పరిధిలోకి నీరు వెళ్లకుండా 1–44 డిస్ట్రిబ్యూటరీలను ఇరిగేషన్ అధికారులు మట్టితో తాత్కాలికంగా మూసివేయించారు. కానీ 'ఏ' జోన్ పరిధిలో చాలా డిస్ట్రిబ్యూటరీల షట్టర్లు శిథిలమవడంతో సాగునీరు లీకేజీ రూపంలో బీడు భూముల్లోకి వృథాగా పోతుంది. దీంతో పాటు మాల్తుమ్మెద శివారులోని డిస్ట్రిబ్యూటరీ–5 నుంచి లీకైన సాగునీరు పంట కాలువ ద్వారా నేరుగా మంజీరలోకి చేరుతుంది. డి–1, డి–4, డి–5, డి–14, డి–31, డి–34లు కూడా శిథిలమవడంతో సాగునీరు లీకేజీరూపంలో వృథాగా పోతుంది. ఫలితంగా ప్రాజెక్టు నీరు 'బీ' జోన్‌లోని చివరి ఆయకట్టుకు చేరడంలో జాప్యం జరుగుతుంది.

కాలువలో పెరిగిన చెట్లు సైతం సమస్యే..

పోచారం ప్రధాన కాలువలో పెరిగిన పెద్దపెద్ద చెట్లు నీటిప్రవాహానికి అడ్డంకిగా మారాయి. ప్రధాన కాలువ ప్రారంభంలో ఉన్న పోచారం నుంచి చివరి వరకు కాలువ వెంట చెట్లు పెరిగి వాటికొమ్మలు అందులోకి వంగిపోయాయి. కాలువలోకి వంగిన చెట్లకొమ్మలు నీటిప్రవాహ వేగాన్ని అడ్డుకొని నీటిని వెనక్కి నెట్టుతున్నాయి. దీంతో ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీరు సకాలంలో చివరి ఆయకట్టుకు చేరలేకపోతుంది. కొన్నిప్రాంతాల్లో కాలువకు ఇరువైపులా పెరిగిన చెట్లకొమ్మలతో కాలువ ఆనవాళ్లు కూడా కనిపించలేని దుస్థితి నెలకొంది. ప్రధాన కాలువలో పెరిగిన చెట్లను తొలగించేందుకు అధికారులు గతంలో ప్రభుత్వానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపినా నిధులు కేటాయించలేదని తెలిసింది. ముఖ్యంగా శిథిలమైన డిస్ట్రిబ్యూటరీలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు ప్రధాన కాలువలో పెరిగిన చెట్లను తొలగిస్తే ప్రాజెక్టు నీరు తమ భూములకు చేరుతుందని చివరి ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): రోడ్డు భద్రతను మెరుగుపరచడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరు తీసుకోవాలని ఆర్టీవో సీఐ సుభాష్ పేర్కొన్నారు. మంగళవారం ధర్మారం టోల్ ప్లాజాలో 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్టీవో మాట్లాడుతూ..రహదారిపై ప్రమాదాలు, ప్రాణనష్టాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ కలిసి పని చేయాలన్నారు. అనంతరం రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేశారు. పెద్దకొడప్‌గల్ ఎస్సై కోనారెడ్డి, టోల్ ప్లాజా ఆర్ఈ రెహమాన్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి అశోక్‌నగర్ కాలనీ మున్నూరుకాపు సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు మామిండ్ల అంజయ్య, ప్రధాన కార్యదర్శి పెట్టుగాడి అంజయ్య, స్థానిక నాయకులు ఆకుల గంగారాం, మల హరి, హన్మాండ్లు, కుంటి అంజనేయులు, ముదాం పెంటయ్య, ఎస్.బాల్‌కిషన్, ఆకుల భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారం

■ చిన్నారులపై దాడి, ఇద్దరికి గాయాలు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని 7వ వార్డులో సోమవారం కుక్కలు స్వైర విహారం చేశాయి. హౌజింగ్ బోర్డు కాలనీలో రోడ్డు పక్కన ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై దాడి చేసి గాయపరిచాయి. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులతో పాటు స్థానిక కౌన్సిలర్ బూక్యా రాజు డిమాండ్ చేశారు.

ప్రేమ మందిరంలో గోపూజ మహోత్సవం

కామారెడ్డి రూరల్: ఉగ్రవాయి శివారులోని షిరిడీ సాయి ప్రేమ మందిరంలో మంగళవారం కనుమ పండుగ సందర్భంగా గోపూజ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆర్గనైజర్ సీతారామచంద్రమూర్తి, వేద పండితుడు గంగవరం ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో సామూహిక గోపూజలు చేశారు. అనంతరం గోమహత్యం గురించి భక్తులకు ప్రవచనాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి బచ్చు విజయ్‌కుమార్, శ్రీ రామకోటి జప లిఖిత ప్రచారకుడు క్రిష్టానంద స్వామి, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సప్త కల్యాణ ఉత్సవాలు



కామారెడ్డి : జిల్లా కేంద్రంలోని వివేకానంద కాలనీలో గల సీతారామాంజనేయ ఆలయంలో మంగళవారం సప్త కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కాలనీవాసులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

మరుగున ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలు

- రీసైక్లింగ్‌కు చర్యలు తీసుకోవాలని నిర్ణయించిన గత ప్రభుత్వం
- ప్రతి జీపీలో ప్లాస్టిక్ సేకరణ కేంద్రాల ఏర్పాటు
- ఆగిపోవడానికి నిర్వహణ లోపమే ప్రధాన కారణం



మోర్తాడ్‌లో ప్లాస్టిక్ సేకరణ కేంద్రం (ఫైల్)

మోర్తాడ్: ప్లాస్టిక్ సామగ్రిని వృథా చేసే బదులు రీసైక్లింగ్ చేసి ప్రజలకు అవసరమైన సామగ్రిని తయారు చేయాలని గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్యరూపం దాల్చలేదు. 2019లో మన ఊరు(పట్టణం)–మన ప్రణాళిక కార్యక్రమాన్ని గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. కార్యక్రమంలో భాగంగానే రీసైక్లింగ్‌కు అవకాశం ఉన్న ప్లాస్టిక్ సామగ్రిని జీపీల్లో సేకరించడానికి ప్రత్యేక యూనిట్‌లను ఏర్పాటు చేసింది. జిల్లాలో 530 జీపీలు ఉండగా చిన్న జీపీల్లో ఒక్కో సేకరణ కేంద్రం, పెద్ద పంచాయతీల్లో జనాభాకు అనుగుణంగా మూడు, నాలుగు ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక సూచిక బోర్డులను సైతం ఏర్పాటు చేయించింది. ప్రతి గ్రామంలో సేకరించిన ప్లాస్టిక్ సామగ్రిని వారం, పది రోజులకు ఒకసారి జిల్లా కేంద్రానికి తరలించి అక్కడి నుంచి రీసైక్లింగ్ కేంద్రాలకు చేరవేయాలని నిర్ణయం తీసుకుంది. ప్లాస్టిక్ సామగ్రిని తరలింపు, రీసైక్లింగ్ బాధ్యతను గత ప్రభుత్వం ఐటీసీ కంపెనీకి అప్పగించింది. ఆరంభంలో కొన్ని రోజుల పాటు ప్లాస్టిక్ సామగ్రి సేకరణ బాగానే కొనసాగింది. మళ్లీ ఈ కార్యక్రమం ముందుకు సాగలేదు. అనేక జీపీల్లో ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలు మరుగునపడ్డాయి. సేకరించిన ప్లాస్టిక్‌ని తరలించడానికి దారులు మూసుకుపోవడంతో ఈ కార్యక్రమానికి మంగళం పలికినట్లు అయ్యింది.

ప్రభుత్వం దృష్టి సారించాల్సిందే..

ప్లాస్టిక్ వ్యర్థాలు వృథాగా పారవేయకుండా రీసైక్లింగ్ చేస్తే పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గత ప్రభుత్వం నామమాత్రంగానే ఈ కార్యక్రమం నిర్వహించగా ఎవరికీ పట్టింపు లేకపోవడంతో మంచి కార్యక్రమం మరుగునపడింది. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే అంశంపై దృష్టి సారించి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణం దెబ్బతినకుండా ఓ యజ్ఞంలా రీసైక్లింగ్ కార్యక్రమాన్ని కొనసాగించాలని పలువురు సూచిస్తున్నారు.

కాలుష్యం పెరుగుతుంది



ప్లాస్టిక్ వ్యర్థాలను వృథాగా పారవేస్తే కాలుష్యం పెరుగుతుంది. అవసరమైన సామగ్రిని రీసైక్లింగ్ చేయడానికి అవకాశం ఉంది. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం కొనసాగించాలి. ప్లాస్టిక్ రీసైక్లింగ్‌తో మానవాళికి ఎంతో ఉపయోగం కలుగుతుంది.

– పెండెం శ్రీనివాస్, వద్యాట్

పునరాలోచన చేయాలి



పర్యావరణానికి ముప్పును తగ్గించే ప్లాస్టిక్ సామగ్రిని సేకరించి రీసైక్లింగ్ చేసే కార్యక్రమాన్ని కొనసాగించాలి. ప్రభుత్వం పునరాలోచన చేసి ప్లాస్టిక్ సామగ్రిని గతంలో మాదిరిగానే సేకరించాలి. ప్రజలు కూడా సహకరించి ప్లాస్టిక్ సామగ్రిని సేకరణ కేంద్రాలకు చేరవేయాలి. – జక్కం అశోక్, మోర్తాడ్

అన్న మరణాన్ని తట్టుకోలేక..

- చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న జూనియర్ అసిస్టెంట్
- బస్వాపూర్‌లో విషాదచాయలు


శ్రీకాంత్ (ఫైల్)

భిక్కనూరు/ బీబీపేట: అన్నా.. చిన్నప్పటి నుంచి నన్ను చాలా గారాబంగా పెంచావు.. అమ్మానాన్నల కంటే ఎక్కువ ప్రేమను పంచావు. నన్ను ఎవరేమన్నా ఊరుకునేవాడికి కాదు.. అలాంటి నీ మరణాన్ని నేను రెండు నెలలుగా తట్టుకోలేక పోతున్నా.. అందుకే నేనూ నీ దగ్గరికే వచ్చేస్తున్నా అంటూ ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బీబీపేట మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన మార్కంటి శంకర్, నాగరాణి దంపతులకు గణేశ్, శ్రీకాంత్ ఇద్దరు కుమారులు. గణేశ్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసేవాడు. శ్రీకాంత్(28) స్వగ్రామంలో వీఆర్‌ఏగా పనిచేస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు బీబీపేట తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గణేశ్ గతేడాది నవంబర్20న హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌లో ఉన్న అద్దెగదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో నాటి నుంచి శ్రీకాంత్ ఎవరితోనూ మాట్లాడడం లేదు. అన్న గణేశ్‌ను తలచుకుంటూ ప్రతిరోజూ బాధ పడేవాడని తెలిపారు. దీనికి తోడు కొన్ని నెలలుగా వేతనం రావడం లేదంటు చెప్పేవాడని గ్రామస్తులు తెలిపారు. మంగళవారం విధులకు వెళ్తున్నాని ఇంట్లో చెప్పి బీబీపేటలోని పెద్ద చెరువులో దూకి శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. తరచూ అన్న మృతినే గుర్తుకు చేసుకుంటూ బాధపడే వాడని బీబీపేట, బస్వాపూర్ రైతులు పేర్కొన్నారు.


బీబీపేటలో మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

రెండు నెలల వ్యవధిలో..

రెండు నెలల వ్యవధిలో ఇద్దరు కుమారులు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు శంకర్, నాగరాణిల రోదనలు మిన్నంటాయి. తమకు తల కొరివి పెట్టే కొడుకులకు తానే తల కొరివి పెట్టాల్సి వస్తుందని అనుకోలేదంటూ తండ్రి చేసిన రోదనలు అక్కడ ఉన్నవారిని కంటతడి పెట్టించాయి. శ్రీకాంత్ అంత్యక్రియలు బుధవారం గ్రామంలో నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బీబీపేట ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

రాముడి కరెన్సీ నోటు విడుదల చేయాలి

- ఈస్టిండియా కంపెనీ పరిపాలనలో శ్రీరామ టంకాల చలామణి


షేర్ అవుతున్న శ్రీరామచంద్రుని రూ.500 నోటు నమూనా

కామారెడ్డి అర్బన్: అయోధ్యలో ఈనెల 22న శ్రీరామచంద్రుడి ప్రాణప్రతిష్ఠ ఉత్సవాల సందర్భంగా ఆర్బీఐ, శ్రీరామచంద్రుడి ఫొటోతో రూ.500 కరెన్సీ నోటు విడుదల చేయాలని కోరుతూ పలువురు సామాజిక మాధ్యమాలలో షేర్ చేస్తున్నారు. అసలు నోటును పోలిన విధంగా శ్రీరామచంద్రమూర్తి ఫొటోతో రూ.500 నోటును డిజైన్ చేసి సామాజిక మాధ్యమాలలో షేర్ చేయడం, ఈ విషయం సామాన్యుల వరకు చేరిపోయింది. రిజర్వుబ్యాంకు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో జ్ఞాపకార్థంగా నాణేలు, కరెన్సీ ముద్రిస్తుంది. 500 సంవత్సరాల అనంతరం అయోధ్య రామమందిర పునఃప్రారంభం, శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ శుభ సందర్భంగా రిజర్వు బ్యాంకు ప్రత్యేక నోటు విడుదల చేస్తే కోట్లాది మంది శ్రీరామభక్తులు కొనుగోలు చేస్తారని అంటున్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలనలో శ్రీరాముడి టంకాలు ద్రవ్య వినియోగంలో చలామణిలో ఉన్న విషయాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి


కప్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి

బాన్సువాడ: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలో మూడు రోజులుగా కొనసాగుతున్న ఈఆర్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని బాన్సువాడలో ఈఆర్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించామని, మంచి స్పందన వచ్చిందని అన్నారు. చాలా మంది క్రీడాకారులు టోర్నమెంట్‌లో పాలుపంచుకున్నారని, క్రీడల్లో ఓటమి చెందిన వారు కుంగిపోకుండా మళ్లీ విజయం సాధించాలనే లక్ష్యంతో ఆడాలని అన్నారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన బాన్సువాడ ఇలియాస్ జట్టుకు కప్‌తో పాటు రూ.20,666 నగదును అందజేశారు. రన్నర్‌ప్‌గా బాన్సువాడ టీటీసీ జట్టుకు కప్‌తో పాటు రూ.10,666 నగదును అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాసాని శ్రీనివాస్‌రెడ్డి క్రీడాకారులకు మూడు బ్యాట్లు అందజేశారు. నిర్వాహకులు మాసాని శేఖర్‌రెడ్డి, అన్వర్, అఫ్రోజ్, నాయకులు ఎలమంచిలి శ్రీనివాస్‌రావు, తదితరులు ఉన్నారు.

20 లోపు దరఖాస్తు చేసుకోవాలి

బాన్సువాడ రూరల్/రామారెడ్డి: ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 20 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బాన్సువాడ మండలంలోని కొయ్యగుట్ట తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల విద్యాలయం ప్రిన్సిపల్ శోభారాణి,రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి గురుకులాల ప్రిన్స్‌పాల్ సత్యనారాయణ మంగళవారం వేర్వేరుగా కోరారు. విద్యార్థులకు ఫిబ్రవరి 11న అర్హత పరీక్ష నిర్వహిస్తారన్నారు.

రెండు అతిథి అధ్యాపక పోస్టులకు..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ, పీజీ తరగతులకు కామర్స్, మ్యాథ్స్ బోధించడానికి రెండు అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 20లోపు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ తెలిపారు. పీహెచ్‌డీ, సెట్, నెట్, బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఇంటర్వ్యూలు ఈనెల 22న కళాశాలలో నిర్వహించనున్నట్లు వివరించారు.

నేడు సొసైటీ చైర్మన్ ఎన్నిక

బిచ్కుంద(జుక్కల్): పుల్కల్ సొసైటీ చైర్మన్ పదవి

సమాచారం..

ఎన్నిక బుధవారం జరగనుంది. చైర్మన్‌గా ఉన్న ఇందిర ప్రహ్లాద్‌రావు గత 2022, సెప్టెంబర్‌లో రాజీనామా చేశారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు డైరెక్టర మధ్య గతంలో రెండున్నర సంవత్సరాల ఒప్పందం జరిగింది. దీంతో ఇందిర ప్రహ్లాద్‌రావు రెండున్నర సంవత్సరాల తర్వాత చైర్మన్ పదవికి రాజీనామా చేశారు.

నేటి వరకు వైస్ చైర్మన్ రాంరెడ్డి చైర్మన్ బాధ్యతలు తీసుకున్నారు. చైర్మన్ పదవి ఖాళీగా ఉండడంతో ఎన్నికలు జరుగుతున్నాయని కార్యదర్శి సాయి ప్రకాష్ తెలిపారు.

రేపు విత్తన క్షేత్రంలో 120 క్వింటాళ్ల ధాన్యం వేలం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మాల్తుమ్మెద విత్తనోత్పత్తి క్షేత్రంలో విత్తనాలుగా ఉపయోగపడని 120 క్వింటాళ్ల దొడ్డు రకం ధాన్యాన్ని వేలం వేయనున్నట్లు ఏడీఏ వీరాస్వామి తెలిపారు. కేఎన్‌ఎం–118 రకం 30క్వింటాళ్లు, జేజీఎల్–24423 రకం 90 క్వింటాళ్ల ధాన్యం గురువారం మధ్యాహ్నం 12 గంటలకు మాల్తుమ్మెద విత్తనక్షేత్ర కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ.2 వేల డిపాజిట్ చెల్లించాలని ఆయన చెప్పారు. వేలం దక్కించుకున్నవారు సగం సొమ్మును రెండురోజులలో చెల్లించాలని, మిగతా మొత్తం సొమ్మును వారం రోజులలో చెల్లించిన తర్వాతే ధాన్యం తీసుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు.

18న విశ్వశాంతి దినోత్సవం

కామారెడ్డి అర్బన్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం కామారెడ్డి సెంటర్‌లో ఈనెల 18న ఉదయం 7 గంటల నుంచి 11 గంటలకు విశ్వశాంతి దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి జయదీదీ తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మబాబా జీవితచరిత, భోగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, ఎమ్మెల్యే కేవీఆర్ హాజరుకానున్నట్లు చెప్పారు.

22న శ్రీరామచంద్రుని ప్రతిష్ఠ సంబరాలు

కామారెడ్డి అర్బన్: అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 22న కామారెడ్డి అయ్యప్ప ఆలయంలో ఉదయం 7–30 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు విశేష కార్యక్రమాలు, సంబరాలు నిర్వహించనున్నట్లు స్వామి అయ్యప్ప సేవా సంఘం, అన్నప్రసాద సేవా సమితి తెలిపింది. భక్తులు విజయవంతం చేయాలని సేవా సమితి కోరింది.

హరినామ సప్తాహంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని మల్కాపూర్ శివారులో ఉన్న హనుమాన్ మందిరంలో నిర్వహిస్తున్న హరినామ సప్తాహంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పాల్గొన్నారు. ఆలయంలో పూజలు చేసి వార్కారీ భజన కార్యక్రమానికి హాజరయ్యారు.

గాలిపటం కోసం పరుగెత్తి..

- ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డ బాలుడు
- విద్యుత్ సరఫరా నిలిపివేసి కాపాడిన ఆటో డ్రైవర్లు

బాన్సువాడ: తెగిన గాలిపటం కోసం వెళ్తూ ఓ బాలుడు ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కరణ్‌సింగ్ అనే బాలుడు సోమవారం తెగిపోయిన గాలిపటాన్ని పట్టుకునే క్రమంలో రోడ్డుపై పైకి చూస్తూ పరుగెత్తుకుంటూ వెళ్లి కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డాడు. ఒక్కసారిగా కరణ్‌సింగ్‌కు మంటలు అంటుకున్నాయి. అక్కడే ఉన్న ఆటో డ్రైవర్లు అప్రమత్తమై ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో కరణ్‌సింగ్ కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాళ్లు, చేతులు, కడుపునకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబీకులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

బాలికపై తండ్రి లైంగికదాడి

బీబీపేట: కంటికి రెప్పలా కాపాడాల్సిన ఓ తండ్రి సొంత కూతురిపై లైంగికదాడికి పాల్పడిన ఘటన భిక్కనూరు పరిధిలోని ఓ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ తిరుపయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ బాలిక స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో చదువుతోంది. ఆదివారం సాయంత్రం తల్లి కూరగాయలు తీసుకొచ్చేందుకు సంతకు వెళ్లగా అదే సమయంలో ఇంటికి వచ్చిన తండ్రి కుమార్తెను బెదిరించి మందుకల్లు తాగించాడు. సదరు బాలిక మత్తులోకి వెళ్లాక లైంగికదాడికి పాల్పడ్డాడు. తల్లి వచ్చిన తర్వాత బాలిక జరిగిన విషయాన్ని తెలుపడంతో స్థానికులతో సహాయంతో చితకబాది పోలీసులకు అప్పగించింది. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గురు రాఘవేంద్ర కాలనీలో ఉన్న ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు.వివరాలిలా ఉన్నాయి.కాలనీలో నివాసం ఉండే గాజుల రాజ్‌కుమార్ ఇంటికి తాళం వేసి సంక్రాంతి పండుగ కోసం స్వగ్రామానికి వెళ్లాడు. మంగళవారం తిరిగి వచ్చేసరికి చోరీ జరిగినట్లు గుర్తించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. దేవునిపల్లి ఎస్సై రాజు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. క్లూస్ టీం బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. ఇంట్లోని బీరువాలో దాచిన 2 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గాంధారిలో పట్టపగలే..

గాంధారి: మండల కేంద్రంలోని దుర్గానగర్ కాలనీలో మంగళవారం పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు ధ్వంసం చేసి చేసి చోరీకి పాల్పడ్డారు. ఆర్‌ఎంపీ డాక్టర్ నగేశ్ దుర్గానగర్‌లో నూతన ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నాడు. పిల్లల చదువుల నిమిత్తం వారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి నగేశ్ హైదరాబాద్‌కు వెళ్లాడు. గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు ధ్వంసం చేసి ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన స్థానికులు ఇంటి యజమానికి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

బోధన్‌రూరల్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కల్దుర్కిలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై నాగనాథ్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి జయనంద్(40) కొన్ని రోజులుగా మద్యానికి అలవాటు పడ్డారు. ఈక్రమంలో అనారోగ్యానికి గురికావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఒకరు..

భిక్కనూరు: కడుపునొప్పి, ఛాతినొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెద్దమల్లారెడ్డిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాసుల శంకర్ (46) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా కడుపు, ఛాతినొప్పితో శంకర్ బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చూయించినా నయం కాలేదు. సోమవారం సాయంత్రం సైతం కడుపు, ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామ చెరువు కట్ట వద్ద శంకర్ చెప్పులు, దుస్తులు కనిపించడంతో కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈతగాళ్లతో చెరువులో గాలించగా శంకర్ మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య మాసుల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

చెట్టును ఢీకొని ఒకరి మృతి


దత్తు (ఫైల్)

వర్ని: చెట్టును ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని జాకోర పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జాకోరకు చెందిన దత్తు(50) పని నిమిత్తం వర్నికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ దత్తు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి వృద్ధుడు..

నవీపేట: మండలంలోని మహంతం గ్రామానికి చెందిన మేకల పోశెట్టి(70) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం తెలిపారు. ఈనెల 14న బహిర్భూమికి వెళ్లిన పోశెట్టి ఇంటికి రాలేదు. కుటుంబీకులు చెరువు సమీపంలో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు ..


శోభన్ మృతదేహం

నిజామాబాద్‌రూరల్(జక్రాన్ పల్లి): కుటుంబ కలహాలతో ఒకరు పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామానికి చెందిన గొల్ల శోభన్(32) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి చెందిన శోభన్ శనివారం రాత్రి గడ్డి మందు సేవించగా గమనించిన కుటుంబీకులు ముప్కాల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తాడ్వాయి: మండలంలోని కృష్ణాజివాడి శివారులో ఉన్న కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని కన్‌కల్ గ్రామానికి చెందిన ఎండీ హైమద్ తన బైక్‌పై కన్‌కల్ నుంచి కామారెడ్డికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కామారెడ్డి నుంచి తాడ్వాయి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్నది. దీంతో బైక్‌పై ఉన్న హైమద్ కిందపడడంతో కాలికి తీవ్రగాయమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని గాయాలైన హైమద్‌ను చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇటుక బట్టీ యజమానిపై కేసు


బట్టీ వద్ద ఫారెస్ట్ అధికారులు

వర్ని: మండలంలోని హుమ్నాపూర్ శివారులో అనుమతులు లేకుండా ఇటుక బట్టీ నిర్వహిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్లు వర్ని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బాబు మంగళవారం తెలిపారు. సోమవారం ఇటుకల బట్టీని తనిఖీ చేయగా అక్రమంగా అటవీ ప్రాంతం నుంచి చెట్లను నరికివేసి బట్టీలో వాడుతున్నట్లు గుర్తించారు. దీంతో సదరు యజమానిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మాక్లూర్: మండల కేంద్రంలో పలు చోట్ల దాడులు నిర్వహించి 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్‌రావు మంగళవారం తెలిపారు. వివరాలు.. పీడీఎస్ బియ్యం విక్రయిస్తున్న అలీం, మొబీన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అంజయ్య, అజయ్‌బాబు పాల్గొన్నారు.

నిందితుల పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై సుధాకర్

రామారెడ్డి: ఓ మహిళకు మాయమాటలు చెప్పి నగదు దోచుకెళ్లిన ఘటనలో ఇద్దరు నిందితులను పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ మంగళవారం తెలిపారు. పీఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.. రెడ్డిపేట గ్రామానికి చెందిన గడీల బైరయ్య అతని భార్య భాగ్యలక్ష్మి ఈ నెల 11న రెడ్డిపేట సమీపంలోని పకీర తండా వద్ద ఒంటరిగా వెళ్తున్న ఓ మహిళతో బైక్‌పై వచ్చి నమ్మకంగా మాటలు కలిపారు. భర్త చనిపోయిన వారికి తాము రూ. 40 వేలు ఇప్పిస్తామని, అందుకు గాను రూ. 6 వేలు ఖర్చు అవుతాయని నమ్మబలికారు. ఇది నమ్మిన సదరు మహిళ తన దగ్గర ఉన్న డబ్బులు తీసే క్రమంలో వీరు ఆమెను బెదిరించి నగదును ఎత్తుకెళ్లారు. దీంతో బాధితురాలు జగదాంబ తండాకు చెందిన బుక్య ధూళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించినట్లు తెలిపారు. ఇందులో బైరయ్య, భాగ్యలక్ష్మిలను నిందితులుగా గుర్తించారు. మండల కేంద్రంలో నిర్వహించిన వాహనాల తనిఖీలో వారు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

బోధన్‌రూరల్: సాలూర, బోధన్ మండలాల్లోని పలు గ్రామాల్లోని పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి పలువురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ మంగళవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు సోమ, మంగళవారాల్లో బోధన్ మండలంలోని సంగం, ఊట్‌పల్లిలో పేకాట స్థావరాలపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేయగా వారి నుంచి రూ. 7వేల నగదు, సాలంపాడ్ క్యాంప్ వద్ద ముగ్గురు పట్టుకుని రూ. 11వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పెద్దమావంది శివారులో నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురికి చేయగా వారి నుంచి రూ. 20 వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.